విశాలాంధ్ర → విశాఖపట్నం → అనకాపల్లి → అల్లూరి సీతారామరాజు

అగ్రహారానికి అడ్డుకట్ట..!

ఐదు గంటల పాటు రహదారి కోసం ఇబ్బందులు పడ్డ చింతలగ్రహారం గ్రామస్తులు

విశాలాంధ్ర - పెందుర్తి : రెవెన్యూ యంత్రాంగం చేసిన తప్పిదం జివిఎంసి 95వార్డు, లక్ష్మీపురం కూడలిలో బుధవారం ఉద్రిక్త వాతావరణానికి కారణమైంది. వివరాల్లోకి వెళితే లక్ష్మీపురం దరి చీమలపల్లి రెవెన్యూలో ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకునే క్రమంలో లక్ష్మీపురం గ్రామానికి చెందిన చిట్టిబోయిన నాగరాజు కుటుంబం సాగు చేస్తున్న భూమిని జేసిబితో దున్ని, అందులోని మొక్కలన్నింటిని తొలగించి దౌర్జన్యంగా స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఆ రైతు తమ స్థలం ఎక్కడ ఉందని ప్రశ్నించగా మీ స్థలం రోడ్డులో వుందని సలహా ఇచ్చి అధికారులు జారుకున్నారు. దీంతో ఏమి చేయాలో అర్థంకాక, ఆ రైతు రెవెన్యూ యంత్రాంగం చూపించిన రోడ్డును అడ్డగించి తాత్కాలికంగా అడ్డుకట్ట వేశారు. ఈ చర్యతో చింతల అగ్రహారం గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. ఈ నేపథ్యంలో గ్రామస్థులకు, రైతుకు మధ్య వాగ్వాదం జరిగింది. రెవెన్యూ అధికారుల చూపించిన స్థలంలో, వాళ్ళు వుండగానే రోడ్డుపై అడ్డుకట్ట వేశామని రైతు తెలిపారు. ఆ తర్వాత తమ స్థలం ఇప్పించండని రైతు, గ్రామానికి దారి చూపించండని గ్రామస్థులు ప్రధాన రహదారిపై వాహనాలను అడ్డగించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఈ సమస్య ఉందని, అయినప్పటికి ఇప్పటి వరకు రహదారిని అడ్డగించలేదని, నేడు రెవెన్యూ యంత్రాంగం చూపడంతో ఈ సమస్య మొదలయిందని తెలిపారు. స్థానికంగా కొంతమందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడం కోసం ఈ స్థలం స్వాధీనం చేసుకున్నారని, వారు చాలా సంవత్సరాలుగా పట్టాల పేరుతో ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, వీరికి రెవెన్యూ యంత్రాంగం సహకరిస్తోందని ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఇరు వర్గాలతో చర్చలు జరిపి, తాత్కాలికంగా సమస్యకు పరిష్కారం చూపారు. అయితే ఈ స్థలంలో ఇళ్ల పట్టాలు ఎవరికి మంజూరు చేశారో, ఎవరి లబ్ధికోసం ఇలా ప్రజలను ఇబ్బందులు పెట్టారో ఉన్నత అధికారులు పరిశీలించి, సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎంకు ఘన స్వాగతం

విశాలాంధ్ర - గోపాలపట్నం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి గురువారం విశాఖపట్నం విమానాశ్రయంలో నగర ప్రథమ పౌరురాలు గొలగాని హరి వెంకట కుమారి, రాష్ట్ర మంత్రులు బూడి ముత్యాల నాయుడు, విడుదల రజని, టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, జిల్లా కలెక్టర్ డా . ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్, జీవీఎంసీ కమీషనర్ రాజా బాబు, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, తదితరులు పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. బుధవారం విజయనగరం జిల్లా నెల్లిమర్ల ఎమ్మెల్యే బి.అప్పలనాయుడు పెద్ద కుమారుని వివాహానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విచ్చేసిన సందర్భంగా విశాఖ విమానాశ్రయంలో ట్రాన్సిట్ హాల్ట్ సందర్భంగా ఆమె ఆయనకు ఘన స్వాగతం పలికారు.

ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు గిరి రైతులకు వరం

ఈవోపీఆర్డీ శ్రీనివాస్

విశాలాంధ్ర - చింతపల్లి: ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పోడు భూములు సాగు చేసుకునే గిరి రైతులకు వరమని ఈవోపీఆర్డీ శ్రీనివాస్ అన్నారు. స్థానిక సచివాలయ కేంద్రంలో వీఆర్వో చిరంజీవి ఆధ్వర్యంలో సచివాలయ పరిధిలోని మల్లవరం గ్రామానికి చెందిన 18 మంది గిరిజనులకు బుధవారం పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల పంపిణీలో భాగంగా ఫిఫ్త్ ఫేస్‌లో మల్లవరం గ్రామానికి చెందిన 18 మందికి ఈ పట్టాలు అందజేయడం జరిగిందన్నారు.

సాగరలో ఏపీకి ఇదేం ఖర్మ

విశాలాంధ్ర - డుంబ్రిగూడ: మండలంలోని సాగర పంచాయతీ కేంద్రంలో బుధవారం స్థానిక టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సుబ్బారావు, మాజీ ఎంపీపీ కె.దన్నేరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న మోడీ సర్కారు

విశాలాంధ్ర - పెందుర్తి: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని కాంగ్రెస్ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ షఫీవుల్లా విమర్శించారు. బుధవారం పెందుర్తిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాల్లో పరీక్ష ఫీజులను దారుణంగా పెంచి సామాన్యులకు చదువును దూరం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పరీక్ష ఫీజును రూ.2300గా నిర్ణయించడం మోడీ సర్కార్ నిరంకుశత్వాన్ని వెల్లడిస్తుందని తెలిపారు. ఇకనైనా అహంకారం వీడి కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో పరీక్ష ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌కు భూమి పూజ

విశాలాంధ్ర - వి.మాడుగుల: మండల కేంద్రం మాడుగుల స్థానిక మోదమాంబ కాలనీ పార్క్ నందు బుధవారం ఉదయం ఎంపీపీ పెదబాబు, గ్రామ సర్పంచ్ యడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాధు శ్రీనువాసరావు చేతుల మీదగా శంకుస్థాపన పనులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభం చేశారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలు నాయుడు కృషి ఫలితంగా 21 లక్షలు వ్యయంతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌కు నిధులు మంజూరైనట్టు ఎంపీపీ పెదబాబు తెలిపారు. మినీ హెల్త్ క్లినిక్ మోదమాంబ కాలనీలో ఏర్పాటు చేయడం పట్ల పలువురు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే మోదమాంబ కాలనీ బాదం వీధిలో 4 లక్షలతో డ్రైనేజీ పనులకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు నిధులు మంజూరు చేయడంతో డ్రైనేజీ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కుక్కర మహేశ్వరీ, పిఏసిఎస్ అధ్యక్షులు పెరుమాళ్ళ వెంకటరావు, వైకాపా పట్టణ అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీనువాసరావు, వార్డ్ మెంబెర్ జవ్వాది వరహాలుతో పాటు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు సీఎం జగన్ ఆశీర్వాదం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కుమారుడి వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను బుధవారం సాయంత్రం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశీర్వదించారు. దాకమర్రి జంక్షన్ రఘు ఇంజినీరింగ్ కాలేజ్‌లో జరిగిన వివాహ వేడుకలో నూతన వధూవరులు స్నేహ, మణిదీప్‌లను సీఎంతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులు పాల్గొని దంపతులను ఆశీర్వదించారు.

సీపీఐ 98వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - జికేవీధి: భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) 98వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కంకిపాటి సత్తిబాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండల శాఖలో శాఖ సభ్యులు ద్వారా జెండా ఆవిష్కరణ చేయాలని అన్నారు. జాతీయోద్యమ కాలం నుండి బడుగు, బలహీన ప్రజల కోసం అలుపెరుగని పోరాటం, వెలలేని త్యాగాలు చేసింది సీపీఐ పార్టీ అన్నారు.

వేతనాల కోసం 108 సిబ్బంది నిరసన

విశాలాంధ్ర - నాతవరం: రెండు నెలల నుంచి ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో అర్ధాకలితో విధులు నిర్వహిస్తున్నామని, వెంటనే వేతనాలు చెల్లించాలని నాతవరంలో 108 సిబ్బంది ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. 2019 ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి 108 సిబ్బందికి ఇచ్చిన హామీలను అమలు చేసి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే రెండు నెలల వేతనాలు చెల్లించాలని వారు కోరారు.

బందుర సరస్సును శుభ్రపరచాలి

విశాలాంధ్ర - నక్కపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు ప్రాచీన సుప్రసిద్ధ ఉపమాక శ్రీ వెంకటేశ్వర దేవాలయంకు చెందిన బంధుర సరస్సును శుభ్రపరచాలని కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిసెట్టి వెంకటేశులు టీటీడీకి వినతిపత్రం అందజేశారు. ఆరో శతాబ్దానికి చెందిన ప్రాచీన దేవాలయంగా రెండవ తిరుపతిగా పేరుగాంచిన ఈ దేవాలయానికి చెందిన బందుర సరస్సు ఎంతో ప్రసిద్ధిగాంచిందని, ఇక్కడ నీటితోనే ఇంతవరకు

స్వామివారికి అర్చనలు, అభిషేకాలు జరిగేవని అన్నారు. 2019 వరకు దేవాదాయ శాఖలో ఉండగా 2019 నుంచి టీటీడీ ఆధీనంలో వెళ్లిందని అప్పటి నుంచి బందుర సరస్సు పట్టించుకోవడం లేదని అన్నారు. వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొప్పిశెట్టి కొండబాబు, ప్రగడ వీరబాబు పాల్గొన్నారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు ధరణి

విశాలాంధ్ర - గాజువాక సిటీ: గాజువాక దువ్వాడ విజ్ఞాన్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని పొదిలాపు ధరణి జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. పల్నాడు జిల్లా నరసారావుపేటలో నవంబరు 29న జరిగిన పోటీల్లో ప్రతిభ చూపిన ధరణి జేఎన్టీయూ వాలీబాల్ జట్టులో స్థానం దక్కించుకుంది. కేరళలోని కొట్టాయంలో ఈనెల 27 నుంచి 31వరకు జరిగే జాతీయస్థాయి విశ్వ విద్యాలయాల ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆమె పాల్గొనున్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న ధరణిని గాజువాక బిజెపి కో-ఆర్డినేటర్ డా.కరణంరెడ్డి నరసింగరావు తమ క్యాంప్ కార్యాలయంలో శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర కార్యాలయంగా విశాఖ పార్టీ కార్యాలయం

టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

విశాలాంధ్ర - మధురవాడ: పరిపాలనా రాజధాని కానున్న విశాఖలో నిర్మిస్తున్న వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయం భవిష్యత్‌లో రాష్ట్ర పార్టీ కార్యాలయం అవుతుందని టీటీడీ చైర్మన్, వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్త వై.వి.సుబ్బా రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎండాడలోని పనోరమా హిల్స్ దగ్గర 2 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న పార్టీ కార్యాలయానికి భూమి పూజ చేసిన అనంతరం సభలో ఆయన మాట్లాడారు. 45 నుంచి 60 రోజుల్లో పార్టీ కార్యాలయం మొదటి దశ పనులు పూర్తి చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్య కర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండేలా రాష్ట్రంలో అన్ని పార్టీ కార్యాలయాల్లో 24/7 కాల్ సెంటర్లు అందు బాటులోకి తీసుకు వస్తామని, న్యాయపరమైన చిక్కులు పరిష్కారం అయిన తక్షణమే పాలనా రాజధాని పనులు మొదలు కానున్నట్లు వెల్లడించారు. జనవరిలో భోగాపురం ఎయిర్ పోర్టుకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటించారు. అదాని డేటా సెంటర్ అందుబాటులోకి వస్తే విశాఖలోని 40 వేల మందికి ఉపాధి కలుగుతుందన్నారు. జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో మంత్రులు విడదల రజని, గుడివాడ అమర్నాథ్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికులకు నూతన వేతనాన్ని వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: వేజ్ రివిజన్ చేయాలని కోరుతూ ఉక్కు సీఎండీని స్టీల్ ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్‌లో సుమారుగా 2,300 కోట్ల రూపాయలు నష్టాలలో ఉందని, శాలరీ ఇవ్వడం కూడా చాలా ఇబ్బందిగా ఉందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌లో రిక్రూట్‌మెంట్ గాని వేజ్ రివిజన్ గాని మన స్టీల్‌ప్లాంట్ బోర్డ్‌లో అయిపోయేదని, ఇప్పుడు అది మినిస్ట్రీ చేతిలోకి వెళ్ళిపోయిం దన్నారు. కావున కంపెనీ లాభాలలోకి రాగానే వేజ్ రివిజన్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో గుర్తింపు యూనియన్ నుండి డి.ఆదినారాయణ, కే.ఎస్.ఎన్.రావు, జె.రామకృష్ణ, ఐఎన్‌టీయూసీ ఎన్.రామచంద్రరావు, కారు రమణ, సీఐటీయూ యు.రామ స్వామి, అయోధ్యరామ్, హెచ్.ఎం.ఎస్. గణపతి రెడ్డి, బి.ఎం.ఎస్. కె.శ్రీనివాసరావు, వైఎస్సార్‌టీ యూసీ వై.మస్తానప్ప, దాలి నాయుడు, టీఎన్‌టీయూసీ మణి, బొడ్డు పైడిరాజు, పి.జయ, సింహాద్రి, యూజ్ పరంధామయ్య, కామేష్, వి.ఎస్.ఎమ్.ఎస్. నుండి జగదీష్, వి.యస్.ఈ.యు. పాడి త్రినాధ్, సీఎఫ్‌టీయుఐ కె.ప్రకాష్, ఏ.ఐ.సి.టి.యు. నుండి సిహెచ్.సన్యాసి రావు, డి.ఐ.టీ.యు. దేవిడ్ పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు అందరి బాధ్యత

కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

విశాలాంధ్ర - అనకాపల్లి: భావితరాల సంక్షేమానికి మనం ఇంధన వనరులను పొదుపుగా, సమర్థంగా వాడుకోవాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఇంధన పరిరక్షణ తెలియజేసే పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. ఈ నెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంధన పరిరక్షణ చిట్కాలు విస్తృతంగా ప్రచారం చేయాలని, ఇంధన పొదుపు వలన జరిగే మేలును చెప్పాలన్నారు. ఏపీఈపీడీసీఎల్ ఈఈ, నోడల్ అధికారి ఎస్.రమణ మూర్తి మాట్లాడుతూ విద్యుత్ పొదుపు అంటే అవసరం ఉన్నంతవరకే విద్యుత్‌ను ఉపయోగిస్తే పొదుపు చేసినట్లేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఇంజనీర్లు జి.సురేష్ బాబు, కె.రాజశేఖర్ రెడ్డి, విద్యుత్ శాఖ డీఈలు, ఏడీలు, ఏఈలు, సబ్ ఇంజనీర్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మేన్‌లు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాడు-నేడు భవనాలు పూర్తి చేయాలి

జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

విశాలాంధ్ర - హుకుంపేట: గిరిజన ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న నాడు నేడు భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలని పాడేరు జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలో 55 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న నూతన భవనాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో నిర్మిస్తున్న నాడు నేడు కార్యక్రమ భవనాలు పూర్తిచేసి అందించడం వలన విద్యార్థులకు వసతి సమస్య తగ్గుతుందన్నారు. అనంతరం స్థానిక కేజీబీవీలో 52 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న నూతన భవనాలను పరిశీలించారు. ఈ భవనాల నిర్మాణం ఎందుకు జాప్యం జరిగిందని జేఈలను ప్రశ్నించారు. అనంతరం కేజీబీవీ పాఠశాల ప్రతి తరగతి గదిని క్షుణ్ణంగా పరిశీలించారు. కొంతమంది విద్యార్థినిలు నేలపై కూర్చుని ఉండడం గమనించి ప్రశ్నించారు. తగినన్ని బెంచీలు ఏర్పాటు చేయాలని హెచ్‌ఓ జయప్రదను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రామ్ చంద్రరావు, కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడు, రమేష్, దేవుడు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ముగ్గురు విద్యార్థుల మధ్య ఘర్షణ

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలంలోని గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. తొమ్మిదో తరగతి చదువుతున్న జర్త కొండబాబు ఈనెల 6వ తేదీన అంబలి తాగుతున్న సమయంలో సాయి శరత్ వాలీబాల్ ఆడుతూ తన్నాడు. దీంతో జర్త కొండబాబుకు గాయాలయ్యాయి. కాగా సాయి శరత్ స్నేహితుడు దిలీప్ జర్త కొండబాబును కొట్టడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అయితే క్లాస్ టీచర్, హెల్త్ అసిస్టెంట్ జి.మాడుగుల ఆసుపత్రిలో చేర్పించి వైద్యం అందించి ఇంటికి పంపించినట్టు గిరిజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి కూడా రాధా కృష్ణ, నాయకులు జల్లి రాజుబాబులు తెలి పారు. అయినా కొండబాబు పరిస్థితి మెరుగు కాకపోవడంతో పాడేరు జిల్లా ఆసుపత్రికి చేర్పించారని వైద్యం అందించినప్పటికీ మెరుగైన వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు రిఫర్ చేశారన్నారు. కొండబాబుపై దాడి చేసిన విద్యార్థులపై, స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మృతుని కుటుంబానికి వైఎస్సార్ బీమా

విశాలాంధ్ర - హుకుంపేట: సూకూరు పంచాయతీ బిర్సింగి గ్రామానికి చెందిన కోర్ర నూకరాజు అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబానికి స్థానిక సర్పంచ్ ధనసాని సత్యవతి చేతుల మీదుగా వైఎస్ఆర్ బీమా మొత్తం 90000 రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూకరాజు మరణంతో ఆ కుటుంబం దిక్కులేని స్థితిలో వుందని ఈ మేరకు నగదును అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మురళి, సచివాలయం కార్యదర్శి పరశురాం, వెల్ఫర్ అసిస్టెంట్ జి.సత్యవతి, వలంటీర్ సుబ్బారావు పాల్గొన్నారు.

నూనెల సూరిబాబుకి జేవీఎస్ఎన్ పరామర్శ

విశాలాంధ్ర - మల్కాపురం: కామ్రేడ్ నూనెల సూరిబాబును సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి బుధవారం మల్కాపురం సూరిబాబు నివాసానికి వచ్చి పరామర్శించారు. ఇటీవల కామ్రేడ్ సూరిబాబు సతీమణి కాలం చెందిన వారి కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం తెలిపారు. ఆయనతోపాటు సీపీఐ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులు గుడాల రాంబాబు, వెంకట్రావు తదితరులు ఉన్నారు.

మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని పీఎల్‌పురం, తూర్పుగోదావరి జిల్లా చామవరం, తాళ్లూరు గ్రామాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాలకు శ్రీ సాయి శ్యామల తాపీ పని వారుల సంఘం అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు సంఘం తరుపున ఒక్కో కుటుంబానికి రూ.5వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఈకార్యక్రమంలో చందా శ్రీనివాసరావు, తమరాన త్రిమూర్తులు, పడాల ఎరకయ్య, పడాల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిని కలిసిన అన్నం

విశాలాంధ్ర - యలమంచిలి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను హైదరా బాద్‌లో బుధవారం ఆయన స్వగృహంలో యలమంచిలి టీడీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు అన్నం వెంకట్రావ్ మర్యాద పూర్వకంగా కలిసి, దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం యలమంచిలి పరిధిలో టీడీపీ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు పార్టీ కార్యక్రమాలు లోకేష్‌కు వివరించినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ, మండల స్థాయి నాయకులతో ఎప్పటికప్పుడు చర్చిస్తూ పార్టీని బలోపేతం చేయాలని, పార్టీ అభివృద్ధి కొరకు సూచనలు చేసినట్లు తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలి

ఏఐవైఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర - అనకాపల్లి: ఉద్యోగ ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వకుండా మానసికంగా ఇబ్బం దులకు గురి చేస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. 1వ తేదీన చెల్లించాల్సిన జీతాలు 14వ తేదీ అయినా చెల్లించక పోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రం ఆదాయం బాగానే ఉందని చెప్పిన జగన్మోహన్ రెడ్డి జీతాలు ఇవ్వకున్నా వారిపై కక్ష సాధింపు చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే జీతాలు చెల్లించాలని లేనిపక్షంలో ఉద్యోగులకు మద్దతుగా ఆందోళనా కార్యమాలు నిర్వహిస్తామని ప్రధాన కార్యదర్శి రాజు హెచ్చరించారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - పాడేరు: విజయ్ దివస్ సందర్భంగా జాతీయ సేవా పథకం పాడేరు ఆధ్వర్యంలో గణేష్ కొమ్మోజు సహాయ సహకారంతో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 16న ఉదయం 9.00 నుండి మధ్యాహ్నం 3.00 వరకు నిర్వహించడం జరుగుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. చిట్టిఅబ్బాయి, జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారి గౌరీ శంకర్‌రావు తెలిపారు. వివరాలకు 8297374754, 9014161591ను సంప్రదించాలని కోరారు.

భార్యను గాయపరిచిన భర్త

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం పాండ్రంకి గ్రామపంచాయతీ రౌతులపాలెం గ్రామంలో మజ్జి పోతయ్య (34) అనే వ్యక్తి తన భార్య అయిన మజ్జి సూర్యం దారుణంగా గాయపరిచిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే 2005 సంవత్సరంలో మజ్జి సూర్యంను పోతయ్యకి ఇచ్చి వివాహం జరిపించారు. అప్పట్లో ఒక లక్ష రూపాయలు నగదు, ఐదు తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. అయతే అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో భరించలేక ఇద్దరు ఆడపిల్లలతో పుట్టింటికి వెళ్లిపోయింది. కొంతకాలం తర్వాత పెద్దమనుషుల సమక్షంలో భార్యను అత్తవారింటికి తీసుకువచ్చాడు. ఈ క్రమంలోనే మళ్లీ భార్యపై వేధింపులు మొదలుపెట్టి దాడికి పాల్పడ్డాడు. కత్తితో దాడి చేసి చేతిపై, మెడపై దాడి చేశాడు. భర్త పోతయ్యపై పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిలగాడలో పీహెచ్‌సీ ప్రారంభించిన ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండలంలో గల కిలగాడ పంచాయతీ కేంద్రంలో ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ద్వారా 90 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ జి.సుభద్రలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పీహెచ్‌సీ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. అల్లూరి జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల ఏర్పాటు చేస్తుందని, కళాశాలలో గిరిజన వైద్యరంగంలో ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థి, విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో మూడు కోట్ల 50 లక్షల రూపాయలతో గిరిజన సంక్షేమ బాలికల గృహాన్ని జిల్లా పరిషత్ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ రాంబాబు, మండల వైస్ ఎంపీపీ భాగ్యవతి, డీఎం హెచ్‌ఓ లీలా ప్రసాద్, ఎంపీడీవో కిరణ్ కుమార్, పంచాయతీరాజ్ ఏఈ మురళీకృష్ణ, ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ జాఫర్, సీడీపీఓ రాజేశ్వరి, ఎస్సై రవీంద్ర, సర్పంచ్ నీలకంఠం, ఎంపీటీసీ కమల, వైసీపీ నాయకులు జగబంధు, జెవివిఎస్ మూర్తి, అప్పారావు, కొండలరావు, దాసు పాల్గొన్నారు.

విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తాం

డీఎల్‌పీఓ ఎస్ఎస్ఎన్.మూర్తి

విశాలాంధ్ర - నాతవరం: మండలం వైబి.పట్నం గ్రామ పంచాయతీ కార్యదర్శిపై బుధవారం జరిగిన విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు విచారణ అధికారి అయిన నర్సీపట్నం డివిజనల్ పంచాయతీ అధికారి ఎస్ఎస్ఎన్.మూర్తి తెలిపారు. విచారణ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైబి.పట్నం పంచాయతీ కార్యదర్శి హుస్సేన్‌పై పింఛన్, వైయస్సార్ చేయూత నిలుపుదల తదితర అభియోగాలపై వైబి.పట్నం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కూండ్రపు అప్పలనాయుడు లోకయుక్తాకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. లోకాయుక్త ఆదేశాలతో జిల్లా కలెక్టర్ విచారణ అధికారిగా తనను నియమించారన్నారు. ఈ మేరకు కూండ్రపు అప్పలనాయుడును, పంచాయతీ కార్యదర్శి షేక్ హుస్సేన్‌ను విడివిడిగా విచారణ జరపడం జరిగిందని, ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎల్.యాదగిరీశ్వరరావు, ఈవోపీఆర్డి తదితరులు పాల్గొన్నారు.

యువహో మెగా వాలీబాల్ టోర్నమెంట్‌కు విశేష స్పందన

విశాలాంధ్ర - సీలేరు: జీకేవీధి మండలం సీలేరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గల గుమ్మిరేవుల పంచాయతీ మాదిగ మల్లు గ్రామంలో బుధవారం అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువహో మెగా వాలీబాల్ టోర్నమెంట్‌కు విశేష స్పందన వచ్చింది. ఈ పోటీలకు వందలాది మంది క్రీడాకారులు తరలివచ్చారు. జిల్లా ఎస్పీ సుమిత్‌కుమార్ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.25వేలు, 2వ బహుమతిగా రూ.15వేలు, మూడవ బహుమతిగా రూ.10వేలు ఇవ్వడంతో పాటు మొదటి మూడు స్థానంలో ఉన్న జట్లకు షీల్డ్‌లు అందజేసామని చింతపల్లి ఏఎస్పీ కొమ్ము ప్రశాంత్‌కిశోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జీకేవీధి సిఐ అశోక్‌కుమార్, సీలేరు ఎస్సై రామకృష్ణ, జికెవీధి ఎస్సై అప్పలసూరితో పాటు సీఆర్పీఎఫ్ పోలీసులు, యువత, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితా సవరణ వేగవంతం చేయాలి

తహశీల్దార్ ప్రసాద్

విశాలాంధ్ర - చింతపల్లి: ఓటర్ జాబితా సవరణ వేగవంతం చేయాలని తహసిల్దార్ ఎస్ ఎల్ వి ప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన రెవెన్యూ సిబ్బంది, బిఎల్ఓ లతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఓటర్ జాబితా సవరణ వేగవంతం చేయాలన్నారు. ప్రతి ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలని ఉన్నత అధికారుల నుండి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయన్నారు. ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ మొదలుపెట్టి ఇప్పటికే చాలా సమయం గడిచిందని, ప్రతి బిఎల్ఓ తమ పీఎస్ పరిధిలో ఉన్న ఓటర్లందరికి మరో మూడు రోజుల్లో ఆధార్ అనుసంధాన ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. లేని పక్షంలో వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి పోతురాజు బాలయ్య మాట్లాడుతూ ఓటరుకు ఆధార్ అనుసంధానం చేసే సమయంలో ఏ ఒక్క ఓటరు మిస్ కాకుండా అందరికీ ఆధార్ అనుసంధానం చేయవలసిన బాధ్యత బిఎల్ఓ ల పై ఉందన్నారు. రేపు ఎన్నికల కమిషన్ ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేసి ఎవరిదైనా ఓటు రద్దయినట్లయితే ఆ ప్రభావం బిఎల్ఓ ల పై ఉంటుందని దానిని దృష్టిలో పెట్టుకొని పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లాలం సీతయ్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గోవింద్, చిన్నయపడాల్ , బిఎల్వోలు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దళితులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేయాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: దళితులకు ప్రభుత్వం ప్రకటించిన 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేయాలని పట్టణంలోని దళితులు కోరుతున్నారు. దళితులందరికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ప్రకటించినప్పటికీ స్థానిక విద్యుత్ సిబ్బంది బిల్లులు కట్టాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. విద్యుత్ బల్లులు 50 యూనిట్ల నుండి 100 యూనిట్ల లోపు వస్తున్నాయని దళితులు తెలిపారు. అయినా బిల్లులు కట్టాలని, లేదంటే మీటర్లకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని విద్యుత్ సిబ్బంది బెదిరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకొని దళితులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేయాలని కువ్వల కుమార్, జంప సూర్యారావు, జగదీష్, లక్ష్మి, చంద్రమ్మ, తలుపులు, పార్వతి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

జీపీడీపీ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - చింతపల్లి: మండల స్థాయి గ్రామ పంచాయతీ అభివృద్ధి (జి పి డి పి) శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పంచాయతీల అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని ఎంపీపీ కోరాబు అనూష దేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పలు పంచాయతీలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖలకు చెందిన సచివాలయ సిబ్బందితో గ్రామపంచాయతీ అభివృద్ధి కార్యక్రమం (జీపిడిపి) నిర్వహించారు. ఈవోపీఆర్డి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామపంచాయతీ అభివృద్ధి ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి సర్పంచ్లు, ఎంపీటీసీలు అధికారులతో సమన్వయం చేసుకొని పంచాయతీలలోని గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. అభివృద్ధిపై ప్రతి ఏటా ప్రణాళికలు రచించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాజంగి సర్పంచ్ వీ. మహేశ్వరి, ఎంపీటీసీ సభ్యులు దాసరి ధారలక్ష్మి , చిందాడ జయలక్ష్మి, ఎల్ మీనా కుమారి, రావుల నాగమణి, జే. రూతు, యస్ సత్తిబాబు, మోహన్ రావు, అప్పారావు, సూరిబాబు, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ ఎన్.టి.రామారావు, మండలంలోని వివిధ పంచాయతీల కార్యదర్శులు, వివిధ శాఖలకు చెందిన సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా ద్వారా ఆర్థికసాయం

విశాలాంధ్ర - యలమంచిలి రూరల్: మండలంలో మేజర్ పంచాయతీ ఏటికొప్పాక గ్రామానికి చెందిన కర్ణం గిరిబాబు ఈ నెల 12వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. వైయస్సార్ బీమా తక్షణ సహాయం ద్వారా మృతుడు గిరిబాబు భార్య పూర్ణకు పదివేల రూపాయలు అందజేసినట్లు యలమంచిలి జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి, రాము బుధవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త విధివిధానాలతో సీఎం జగన్ వైఎస్సార్ బీమా పథకాన్ని ప్రారంభించారన్నారు. అంతకుముందు అమలులో ఉన్న బీమా పథకానికి కేంద్రం అందజేసే ఆర్థిక సహాయం నిలిపివేయడంతో ఈ పథకానికి అయ్యే మొత్తం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ పేదలకు ఉచిత బీమాను అందజేస్తోందన్నారు. దీని ద్వారా సాధారణ, ప్రమాదవశాత్తు మరణించిన వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నగిరెడ్డి అమ్మాజి, అచ్చినాయుడు, వెల్ఫేర్ అసిస్టెంట్ అప్పలరాజులు ఉన్నారు.

నెహ్రూ చౌక్‌లోని బస్‌స్టాప్‌ను పరిరక్షించాలి

విశాలాంధ్ర - అనకాపల్లి: అనకాపల్లి నెహ్రూ చౌక్‌లోని విశాఖపట్నం వెళ్లే బస్సు స్టాప్ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని ప్రయాణికులు కూర్చోలేని విధంగా దుర్గంధం కొంతమంది బస్ స్టాప్ ను స్థిరనివాసులుగా ఏర్పరచుకుని అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని దుర్వాసన వెదజల్లుతుండం వల్ల ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ, సిపిఎం, ఆమ్ ఆద్మీ, బీజేపీలకు చెందిన ప్రతినిధులు జీవీఎంసీ జోనల్ కమిషనర్‌కు, టౌన్ సిఐకు టౌన్ ట్రాఫిక్ సిఐ కి వినతి పత్రాలు అందజేశారు. బస్ స్టాప్ వద్దే రోడ్డుపైన దుకాణాలు ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారని తెలియజేశారు. అధికారులు వెంటనే చర్య తీసుకుని ఈ సమస్యల నుండి ప్రయాణికులకు ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని వివరించారు అలాగే వివిధ రాజకీయ పార్టీలు ప్రజాసంఘాలు పలు కార్యక్రమాలు నిర్వహించే స్థలంలో దుకాణాలు అడ్డుగా పెట్టడం వల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వై.ఎన్.భద్రం, చెల్లూరు నాగరాజు, తాకాసి వెంకటేశ్వరరావు, కోరుపల్లి శంకర్రావు, సిపిఎం నాయకులు గంట శ్రీరామ్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు హరినాథ్ బాబు, బీజేపీ నాయకులు ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏటికొప్పాకలో తుఫాన్‌కి దెబ్బతిన్న పంటలు పరిశీలన

విశాలాంధ్ర-యలమంచిలి రూరల్: మండలంలో మేజర్ పంచాయతీ ఏటికొప్పాక గ్రామంలో ఇటీవలే తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను బుధవారం యలమంచిలి వ్యవసాయాధికారి ఉమాదేవి పరిశీలించారు. మరలా తుఫాను ఉండటంతో రైతులకు పంటలను కొయ్యవద్దని సూచించారు. అదే విధంగా దెబ్బతిన్న పంటకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏ వీణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనానికై యలమంచిలి నుంచి సైకిల్ యాత్ర

విశాలాంధ్ర-యలమంచిలి: విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు యలమంచిలి నుండి విజయవాడకు సైకిల్‌పై యాత్ర చేపట్టారు. పట్టణంలో ధర్మవరంలో శ్రీ కనకమహాలక్ష్మి పీఠంకి చెందిన ముత్తురెడ్డి శ్రీను అనే భవాని మాల ధారణ భక్తుడు పీఠం గురు భవానీల ఆధ్వర్యంలో భవాని మాల ధరించి 41 రోజులు అమ్మవారి దీక్ష పూర్తిచేసుకుని బుధవారం విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు సైకిల్‌పై యాత్రను ప్రారంభించారు. మూడు రోజులు పాటు సాగే ఈ సైకిల్ యాత్ర గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి ఏడాది సైకిల్‌పై ప్రయాణించి అమ్మవారి సన్నిధికి చేరుకొని అమ్మవారిని దర్శించుకుంటారని గురు భవానీలు కనక, బాబురావు, టి.మాణిక్యాలరావు(నాని), టి.చిన అప్పారావు(చిన్ని), భవానీలు తెలిపారు.

విశాఖలో రెండవ రోజు జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాల జోనల్ స్థాయి రెండవ రోజు పోటీలను విశాఖపట్నంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఉడా చిల్డ్రన్స్ థియేటర్‌లో పర్యాటక, సాంస్కృతిక, యువజనాభివృద్ధి శాఖా మంత్రి ఆర్.కె.రోజా, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర మంత్రులు విడదల రజిని, గుడివాడ అమరనాథ్, జిల్లా కలెక్టర్ డా .ఎ.మల్లిఖార్జున, ఎమ్మెల్సీలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, మన్యం,విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన కళాకారులచే సాంప్రదాయ నృత్యరీతులు భరతనాట్యం, గాత్రం జానపద కళారూపాలు తప్పెటగుళ్లు, కాళికా వేషాలు, గిరిజన కళారూపాలు ధింసా తదితర విభాగాల పోటీలను మంత్రి ఆర్.కె.రోజా తిలకించారు. తప్పెటగుళ్ళు, ధింసా కళా బృందాలతో కలిసి నృత్యంలో పాల్గొన్నారు. అనంతరం పోటీలలో పాల్గొన్న కళాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తున్న ప్రముఖ సంగీత ప్రొఫెసర్ డాక్టర్ మండపాక శారద, ప్రముఖ నాట్యాచార్యులు శ్రీ హరి రామమూర్తి, భరణి శంకర్, ప్రముఖ జానపద కళాకారులు నాగరాజ్ పట్నాయక్, విజయ తదితరులను మంత్రి సన్మానించారు. కోరాడ రామయ్య బృందం, శ్రీకాకుళం వారిచే తప్పెటగుళ్ళ ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్ కుమార్, అదీప్ రాజ్, శాసనమండలి సభ్యులు వరుదు కళ్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి చైర్ పర్సన్ వంగపండు ఉష, మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

యువత సవాళ్లను స్వీకరించగలగాలి

- ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణ మోహన్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భవిష్యత్ సవాళ్ళను స్వీకరించి తదనుగుణంగా తమ సామర్థ్యాలతో వాటికి పరిష్కారాలు చూపే దిశగా యువతను తీర్చిదిద్దాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. బుధవారం ఉదయం ఏయు మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో కమిషనర్ ఆఫ్ కాలేజీయే ట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐదు రోజుల నైపుణ్య శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఇన్సూరెన్స్ ప్రమోషన్ అంశంపై కామర్స్ మేనేజ్మెంట్ అధ్యాపకులకు ఈ ఐదు రోజుల శిక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా రిజిస్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ సమాజానికి అవసరమైన మానవ వనరులుగా యువతను తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులపై ఉంటుందన్నారు. ఈ శిక్షణా తరగతులు అధ్యాపకుల జ్ఞానాన్ని పెంపొందించడానికి నూతన జ్ఞానాన్ని జోడించడానికి ఉపయుక్తంగా నిలుస్తుంది అన్నారు. అధ్యాపకులకు నిరంతర అధ్యయనం, అభ్యాసం ఎంతో అవసరమని సూచించారు. నూతన విద్యా విధానంలో విలువలతో కూడిన విద్యను భాగం చేయాలని సూచించారని దీనిని సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత అధ్యాపక వర్గంపై ఉందన్నారు. భవిష్యత్తులో యంత్రాలతో పోటీ పడవలసిన రోజులు వస్తున్నాయని దీనికి అనుగుణంగా యువతలో నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు.పాలక మండలి సభ్యులు గిరిజా అగస్టీన్ మాట్లాడుతూ మంచి సమాజాన్ని నిర్మించడంలో అధ్యాపకులు తమ ఆలోచనలను, మేధస్సును ఉపయోగించాలని కోరారు. నేటి సమాజంలో మానవత్వంతో నడుచుకోవడం, విలువలను కలిగి ఉండడం ఎంతో ఆవశ్యకమని సూచించారు. ఏయూ మానవ వనరుల అభివృద్ధి కేంద్రం సంచాలకులు ఆచార్య ఎన్ఏడి పాల్ మాట్లాడుతూ కాలానుగుణంగా విభిన్న శాస్త్ర అంశాలపై అధ్యాపకులకు నైపుణ్య, పునఃశ్చరణ తరగతులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ వి ఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్ బాబు, డాక్టర్ రాజ్ కుమార్, మాస్టర్ ట్రైనర్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణా తరగతులకు ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాలకు చెందిన 50 మంది అధ్యాపకులు హాజరయ్యారు.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇళ్లను పరిశీలించిన బీజేపీ నేతలు

విశాలాంధ్ర - జి.మాడుగుల: జి.మాడుగుల మండలం గాంధీ నగరం గ్రామంలో బీజేపీ ఎస్టి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కురుస ఉమా మహేశ్వరరావు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రజలకు ఇచ్చిన ప్రధాన మంత్రి అవాస్ యోజన ఇళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అరకు పార్లమెంట్ జిల్లా ఇంచార్జి పరశు రామరాజు పాల్గొన్నారు. వారు లబ్దిదారులతో ఇళ్ల నిర్మాణం జరుగుతున్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మొత్తం 8 ప్రధాన మంత్రి అవాస్ యోజన కింద ఇల్లు మంజూరయ్యాయని బీజేపీ నేతలకు తెలిపారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే లక్ష ఏనభై వేల రూపాయలు ఇళ్ల నిర్మాణానికి సరిపోవటం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వాటాగా లక్ష రూపాయలు లబ్దిదారులకు ఇస్తే ఇళ్ల నిర్మాణం వేగవంతం అవుతుంది అని బీజేపీ నేతల వద్ద వాపోయారు. అనంతరం బీజేపీ జిల్లా ఇంచార్జి పరశు రామరాజు మాట్లాడుతూ జి.మాడుగుల మండలంలో మొత్తం 1170 ఇళ్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది అని తెలిపారు. ఈ వైసీపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఇళ్లను తమదిగా చెప్పుకుంటూ ప్రచారం చేసుకోవటం సిగ్గు మాలిన చర్య అన్నారు. గిరిజన ప్రజలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూడా కృష్ణారావు, ఎస్టి మోర్చా జోనల్ ఇంచార్జి కురుస రాజారావు, బీజేపీ మండల అధ్యక్షులు వాసది సుబ్బారావు, మండల ఇంచార్జి నందోలి ఉమా మహేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి నూకరాజు, బీజేవైఎం జిల్లా కార్యదర్శి సలుగు సతీష్ పడాల్, మండల నాయకులు ఎస్.చిరంజీవి, జి.లక్ష్మణచారి పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయానికి స్థలం కేటాయించాలి

విశాలాంధ్ర - అనకాపల్లి: నాలుగు దశాబ్దాల ఘన చరిత్ర కలిగిన టీడీపీ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లాలో పార్టీ ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, స్థలం కేటాయించాలని కోరుతూ అనకాపల్లి జిల్లా టీడీపీ అధ్యక్షులు నాగజగదీష్ ఆధ్వర్యంలో డీఆర్వోకు వినతి అందించారు. జిల్లా కలెక్టర్‌కు రెండు ఎకరాల స్థలం అనకాపల్లి సుంకరమెట్ జంక్షన్ నుండి సిరసపల్లి గ్రామాల మధ్య ఉన్న స్థలంలో కేటాయించాలని అన్నారు. అనకాపల్లి ప్రధాన కేంద్రంగా టీడీపీ జిల్లా కార్యాలయంలో శాశ్వత ప్రాతిపదికన అనకాపల్లిలో ఏర్పాటు చేయుటకు టీడీపీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఏపీ జిఓ. ఎంఎస్ నెంబర్ 360 రెవెన్యూ(అసైన్మెంట్-1) డిపార్ట్మెంట్ తేదీ 21- 7- 2016 ఏపీ జిఓ. ఎంఎస్ నెంబర్ 551 రెవెన్యూ (అసైన్మెంట్ -1) డిపార్ట్మెంట్ తేదీ 14-9-2012 ఈ జీవో ప్రకారం రెండు ఎకరాల విస్తీర్ణం కలిగిన స్థలాన్ని జాతీయ స్థాయి గుర్తింపు పొందిన టీడీపీకి కేటాయించాలన్నారు. వైసీపీ పార్టీలకు కేటాయించినట్లుగా టీడీపీ పార్టీకి అనకాపల్లి జిల్లా తరపున కేటాయించాలని విజ్ఞప్తి చేశామని నాగ జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో చోడవరం నియోజవర్గ ఇన్చార్జ్ బత్తుల తాతయ్య బాబు, మాడుగుల నియోజవర్గం ఇంచార్జ్ పి వి జి కుమార్, పార్లమెంటు ఆర్గనైజింగ్ కార్యదర్శి కుప్పిలి జగన్, పార్లమెంట్ కార్యదర్శి మల్ల గణేష్ పాల్గొన్నారు.

తక్కువ వడ్డీరేట్లతో యుబిఐ వాహన రుణాలు

గీతంలో మెగా కార్‌లోన్ మేళా ప్రారంభించిన బ్యాంక్

విశాలాంధ్ర - మధురవాడ: ప్రముఖ ప్రభుత్వరంగ బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యుబిఐ) ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగా అతితక్కువ వడ్డీ రేట్లుతో వాహన, గృహరుణాలను అంది స్తోందని బ్యాంక్ ప్రాంతీయ అధిపతి నటరాజ్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆవరణంలో గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్‌తో కలిసి బుధవారం మెగా కార్‌లోన్ మేలాను ఆయన ప్రారంభించారు. బ్యాంక్ రుణాల మంజూరు సమయంలో ఎటువంటి ప్రాసెసింగ్ ఫీజులను లేకుండా త్వరిత గతిన రుణాలు మంజూరు చేస్తున్నామని యుబిఐ అధికారి వెల్లడించారు. గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ మాట్లాడుతూ ఖాతాదారుల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా బ్యాంక్ సేవలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. దేశంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యుబిఐ) ప్రశంసనీయ సేవలు అందిస్తోందని కొనియాడారు. కార్యక్రమంలో యుబిఐ మేనేజర్లు సింధు సాగర్, రమేష్ కొండవీటి, గీతం ఛీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ రవిశ్రీనివాస్, డిప్యూటీ ఫైనాన్స్ ఆఫీసర్ కళ్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మారికవలసలో క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - కొమ్మాది: మారికవలసలో రాజీవ్ గృహకల్ప కాలనీలో జీసస్ బ్లెస్సింగ్ చర్చ్ నిర్వాహకుడు అంతర్జాతీయ సువార్త సేవకుడు రెవరెండ్ విజయ్ కిషోర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది. తదుపరి సంఘ సభ్యులకు పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. చివరిగా క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేసి క్యాండిల్ సర్వీస్ చేయడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీని ఘనంగా సత్కరించారు. ఈ సభకు సభాధ్యక్షత వహించిన సభాధ్యక్షుడు విజయ్ కిషోర్ మాట్లాడుతూ విశాఖపట్నం అంటేనే విశ్వాసుల పట్టణమని అలాంటి ఈ పట్టణంలో దేవుని సేవచేయడము దేవుడు నాకు ఇచ్చిన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ముఖ్య ప్రసంగీకులుగా పాస్టర్ అజయ్ కిషోర్ గారు క్రిస్మస్ సందేశాన్ని ఇవ్వడం జరిగింది. ఈ సమావేశంలో 7వ వార్డు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హనుమంతు సురేష్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల భరత్, సిటీ వైఎస్ఆర్సిపి జనరల్ సెక్రెటరీ ముక్తాబత్తుల రమేష్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ పీవీ సురేష్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 60వ వార్డు ఇంద్ర కాలనీ-2 లో నివాసం ఉంటున్న అంగా ఆదిలక్ష్మి మృతి చెందడంతో కార్పొరేటర్ పీవీ సురేష్ సచివాలయ సిబ్బందితో మాట్లాడి వైఎస్సార్ బీమా కింద లక్ష రూపాయలు మంజూరు చేయించారు. తక్షణ సాయంగా అంత్యక్రియలు జరుపుటకు తన సొంత నిధుల 10,000 రూపాయలు కుటుంబ సభ్యులకి అందజేయడం జరిగినది.

మారుతి ప్రసాద్ ఆత్మహత్యయత్నం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: కనకమహాలక్ష్మి ట్రస్ట్ బోర్డు మెంబర్, కళాకారుల సంఘం అధ్యక్షుడు వంకాయల మారుతి ప్రసాద్ ఆత్మహత్యయత్నంకు పాల్పడ్డారు. కారులో ఉన్న పురుగులు మందును మారుతి ప్రసాద్ తాగినట్లు తెలుస్తుంది. విషయం తెలుసుకున్న బంధువులు మిత్రులు మధురవాడలో ఉన్న గాయత్రీ ఆస్పత్రికి తరలించారు. ఐసీయూలో వైద్యులు చికిత్స అందించినప్పటికీ 48 గంటలపాటు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో సిటీలో ఉన్న కేర్ ఆస్పత్రిలోకి తరలించి నట్లు తెలిసింది. మారుతి ప్రసాద్ ఆత్మహత్యాయత్నం విషయం తెలుసుకున్న వెంటనే భీమిలి సమన్వయ కర్త ముత్తంశెట్టి మహేష్, కార్యకర్తలు ఆసుపత్రికి చేరుకొని మారుతి ప్రసాద్ పరిస్థితిని అడిగి తెలుసుకు న్నారు. ఇటీవలే మారుతి ప్రసాద్ భార్య మృతి మృతి చెందిన విషయం విధితమే. పిఎంపాలెం పోలీసులు ఆయన ఆత్మహత్యయత్నానికి గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

సత్యవరంలో ఇదేం కర్మ రాష్ట్రానికి

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలంలోని సత్యవరం గ్రామంలో "ఇదేం కర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రజలను కలిసి వారి సమస్యను తెలుసుకున్నారు.నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేవని, రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని, నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉన్నదని ప్రజలు తెలిపారు. స్థానికంగా పెద్దేరు రిజర్వాయర్ ఛానెళ్ళు మరమ్మత్తులు లేక చివర ఆయ కట్టు భూములకు నీరు అందలేదని ప్రజలు మొర పెట్టుకున్నారు.. ఈ అనర్థాలు అన్నీ పోవాలంటే జగన్ పోవాలి, బాబు రావాలి అనే నినాదాన్ని పివిజి తెలియజేశారు. అసమర్థత ప్రభుత్వం పోవాలంటే ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి రానున్న రోజుల్లో చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా గెలిపించుకొని, తెలుగు దేశం పార్టీ ని గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా రైతు అధ్యక్షులు గొల్లవిల్లి శ్రీమ్మూర్తి, క్లస్టర్ ఇంఛార్జ్ పుప్పాల రమేష్, యూనిట్ ఇన్‌ఛార్జ్ జెర్రిపోతుల సూర్యనారాయణ, స్థానిక సర్పంచ్ జెర్రిపోతుల నాగమణి, గ్రామ పార్టీ అధ్యక్షులు, జాజుల శ్రీను, కొండలరావు, సత్యవతి, బోరా రాజు , జె.అప్పారావు, జి. సూరిబాబు, ఎమ్.బంగారమ్మ, రాజులమ్మ, లక్ష్మణ్ రావు, నాగేష్, సాంబమూర్తి, కొండలరావు, నాగేష్, రామకృష్ణ , సోమునాయుడు, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ 'వారాహి' చూసి వైసీపీ నేతలు వణుకుతున్నారు

విశాలాంధ్ర బ్యూరో - **విశాఖపట్నం :** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహి వాహనాన్ని చూసి వైసీపీ నేతలు వణుకుతున్నారని జనసేన పార్టీ నార్త్ ఇంచార్జ్ పసుపులేటి ఉషాకిరణ్ అన్నారు. వైసిపి నేతల వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం ఉదయం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జనసేన వీర మహిళ విభాగం నేతృత్వంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "వారాహి" అనేది సప్త మాతృకల్లో అమ్మవారి పేరని, 1982లో ఎన్టీఆర్, 99లో ఎల్కే అద్వానీ రథయాత్రలు చేసి ప్రజల మన్ననలను పొందారని గుర్తు చేశారు. వారాహి రథయాత్ర ద్వారా పవన్ కళ్యాణ్ రాష్ట్రంలోని ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి సిద్ధమవుతున్నారన్నారు. దీనిని చూసి మంత్రి రోజా తట్టుకోలేక పోతున్నారని, ఊసరవెల్లిగా పార్టీలను మార్చే రోజా పవన్ కళ్యాణ్ పై వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తనతో ఫోటో పవన్ కళ్యాణ్ దిగారని మంత్రి అమర్నాథ్ చెప్పడాన్ని ఎద్దేవా చేశారు. హైకోర్టు ఎన్ని మొట్టికాయలు పెట్టిన వీరికి బుద్ధి రావడం లేదన్నారు. టూరిస్ట్ మంత్రి రోజా టూరిస్ట్ అభివృద్ధికి, యువతకు ఉపాధి కల్పించ దంలో ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వాహనాల యాక్ట్ అనుమతితో వారాహి తీసుకుంటే, అక్కడ రిజిస్ట్రేషన్ వాహనాన్ని ఏపీలో ఎంటర్ చేయనీయమని చెప్పడం హాస్యస్పదమన్నారు. అలాగైతే తెలంగాణ రిజిస్ట్రేషన్ వాహనాలను వైసీపీ నేతలు ఇక్కడ ఎలా తిప్పుతున్నారని ఆమె ప్రశ్నించారు. తమ నేత పవన్ కళ్యాణ్ జోలికి వస్తే సహించేది లేదని ఆమె స్పష్టం చేశారు. జనసేన పార్టీ ఉత్తరాంధ్ర మహిళా కోఆర్డినేటర్ ఆదిమూలపు సారిని దేవి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఏం చేసినా వైసీపీ నేతలు ఉలిక్కిపడుతున్నారన్నారు. మంత్రి పదవి ప్రజలు ఇచ్చింది పవన్ కళ్యాణ్ ను దూషించమని కాదని, అభివృద్ధి ఏం చేశారో చెప్పాలన్నారు. జగన్ మోహన్ రెడ్డిగారికి పేకేజీలు ఇచ్చి మంత్రి పదవులు తెచ్చుకున్నారు. వైసీపి నేతలు పర్యాటక నగరమైన విశాఖ జిల్లాను కబ్జాల పేరుతో రూపురేఖలు విచ్చిన్నం చేస్తుంటే పర్యాటక మంత్రి రోజాగారు డాన్సుప్రోగ్రాములు, జబర్దస్తు టీవి కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు .నిజామాటో, ఆటోడ్రైవర్లుగా ఇంజనీర్ విద్యార్థులు జీవనం సాగిస్తున్నారని, వారికి ఉపాధి కల్పించకుండా ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని వైసిపి ప్రభుత్వం అధోగతి పాలు చేసిందని, కాబట్టి పవన్ కళ్యాణ్ ప్రజల సమస్యలను తెలుసు కోవడానికి రథయాత్ర చేపడుతున్నారని స్పష్టం చేశారు. ధర్నాలో వీర మహిళలు, కిరణ్ హర్షవల్లి, ప్రియాంక, యజ్ఞశ్రీ, శాలిని, సురేఖ, అడబాల లక్ష్మీ, తెలుగు లక్ష్మీ, ఎడ్లపల్లి కళా, ప్రియాంక, పిన్నింటి పార్వతీ, పిట్టా రాజేశ్వరి, అనురాధ, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

21న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - నాతవరం : ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21న నర్సీపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని నాతవరం మండల వైసిపి అధ్యక్షులు పైల పోతురాజు కోరారు. బుధవారం పార్టీ మండల ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం నుంచి భారీ ఎత్తున హాజరై శిబిరాన్ని విజయవంతం చేయాలన్నారు. అలాగే ఈ నెలాఖరున సీఎం జగన్ మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు. అదే రోజు రూ.470 కోట్ల 5లక్షలతో తాండవ ప్రాజెక్టు ఏలేరు ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు ముఖ్యమంత్రి శంకుస్తాపన చేస్తారన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికేందుకు మండల నుంచి భారీ ఎత్తున వైసీపీ శ్రేణులు తరలివెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జడ్పిటిసి కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీలు పైల సునీలు, మైనం గోపి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి నూకరాజు, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు శెట్టి లచ్చబాబు మండలంలో గల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

జోడుగుళ్లపాలెం తీరంలో జింక మృతదేహం



విశాలాంధ్ర - మధురవాడ : జీవియంసి జోన 2.జోడుగుల పాలెం బీచ్ వద్ద బుధవారం ఓ జింక మృతదేహం ఒడ్డుకు కొట్టుకు రావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు ఎక్కడ నుంచి వచ్చింది అన్నది తెలియకపోయినా జూ నుండి కానీ సీతకొండ నుండి గాని వచ్చి ఉండొచ్చని భావిస్తున్నారు ఇటీవల సాగరం రమారమి 15 అడుగుల వెనక్కి వెళ్ళిందన్న వార్తల నేపథ్యంలో ఇలా జింక కొట్టుకు రావడం స్థానికులు మరి ఎటువంటి వార్తలు వినవలసి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు ఈ ఘటన పూర్వాపరాలను తెలియజేసి స్థానికుల ఆందోళన నివారించే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు

మోడీ పాలన ప్రపంచానికి ఆదర్శం

విశాలాంధ్ర - రావికమతం : భారతీయ జనతా పార్టీ (బిజెపి)రాష్ట్ర ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా స్థానిక శివాలయం వద్ద బుధవారం మండల పార్టీ అధ్యక్షుడు సాసుబిల్లి మహేష్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు గల్లా రాజేశ్వరరావు అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగినది. ఈ సమావేశంలో ప్రవాస్ యోజన మండల ఇంచార్జ్ కాళ్ళ సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల, గ్రామ, శక్తి కేంద్రాల కమిటీల పటిష్ఠం గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. సీనియర్ నాయకులు గల్లా రాజేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలోకి తీసుకువెళ్లాలని అప్పుడే పార్టీ బలపడుతుందన్నారు. వైయస్సార్ పార్టీ నాయకులు దోచుకోవడం దాచుకోవడం తప్ప ప్రజలకు మేలు చేసినది ఏమీ లేదన్నారు.మండలం లోని రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయని దానివల్ల ప్రజలందరూ ప్రమాదానికి గురి అవుతున్నారు అని వైఎస్సార్ పార్టీ నాయకులు ఈ రోడ్ల మీద దృష్టి పెట్టాలని, మండల భారతీయ జనతా పార్టీ తరుపున డిమాండ్ చేశారు, ప్రవాస్ యోజన మండల ఇంచార్జ్ కాళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి నాయకత్వాన్ని వారు తీసుకొస్తున్న నిర్ణయాలను ప్రపంచ దేశాలను ప్రభావితం చేస్తున్నా మనదేశంలో కొంతమంది మాత్రం దేశాన్ని అవమానించే విధంగా ప్రవర్తించడం మంచిది కాదన్నారు...కరోనా కష్టకాలం నుండి నేటి వరకు ప్రజలకు ఉచితంగా బియ్యం పంపిణీ ఇవ్వడమే కాకుండా అనేక మౌలిక సదుపాయాలని కల్పించడం నరేంద్ర మోడీ ప్రభుత్వానికే చెల్లిందన్నారు.రాష్ట్రంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు అన్నీ కూడా కేంద్ర ప్రభుత్వం నిధులతో అమలు జరుగుతున్న వేనని తెలిపారు.మండల అధ్యక్షుడు సాసుబిల్లి మహేష్ మాట్లాడుతూ మండలంలో బిజెపి పార్టీని పటిష్టం చేయడానికి కార్యకర్తలు అందరూ కూడా కృషి చేయాలన్నారు.

ప్రవేశ పరీక్షల రద్దు చేయడం దుర్మార్గం

విశాలాంధ్ర - కూర్మన్న పాలెం : విశాఖ స్టీల్ ప్లాంట్ లో ప్రవేశ పరీక్షలను రద్దు చేయడం దుర్మార్గమని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి అన్నారు. నేడు స్టీల్ సిఐటియు ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం మార్కెటింగ్, ఎంటీ టెస్ట్ రద్దు చేయడం అన్యాయం అని ఆయన అన్నారు. యాజమాన్యం మేనేజ్మెంట్ ల ట్రైన్ల నియామకం కోసం జనవరి 2020లో నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని, దీనిలో 188 మంది మేనేజ్మెంట్ ట్రైనీలు ఉత్తీర్ణులు అయ్యారని, దీని కోసం సుమారు 40000 మంది పరిసరాల నిరుద్యోగులు ఎంతో ఆశతో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఉద్యోగ కోసం ఎదురు చూచారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కానీ రెండు సంవత్సరాల తర్వాత ఈ టెస్ట్ రద్దు చేయడం వారి ఆశలపై నీరుజల్లునట్టే అయిందని ఆయన అన్నారు. ఈ నోటిఫికేషన్ లోనే ఇప్పటికే స్టీల్ ప్లాంట్ లో పని చేస్తున్నటువంటి కార్మికులు కూడా పాల్గొన్నారు, వీరిలో సుమారు 70 మంది అభ్యర్థులు అర్హత సాధించి పదోన్నతి కోసం ఎదురు చూడటం జరుగుతోందని ఆయన వివరించారు. వీరికి రాతపరీక్షలు నిర్వహించి, మౌఖిక పరీక్ష కూడా నిర్వహించి సెలెక్ట్ చేసినటువంటి అభ్యర్థులను స్టీల్ ప్లాంట్ అమ్మకంలో భాగంగా ఎటువంటి నియామకాలు జరపకూడదనే కారణంతోనే రద్దు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఎంతో ఆశతో పరీక్షలు రాసిన 70 మంది ఇంటర్నల్ అభ్యర్థులకు తక్షణమే పదోన్నతి కల్పించాలని స్టీల్ ప్లాంట్ ఎంప్లాయిస్ సిఐటియు డిమాండ్ చేసోంది. కాబట్టి యాజమాన్యం ఈ విషయం పునర్ ఆలోచించి తక్షణమే ఇంటర్నల్ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వాలని స్టీల్ ప్లాంట్ ఎంప్లాయిస్ సిఐటియు యాజమాన్యాన్ని కోరుతున్నది. ఈ సమావేశంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్, నాయకులు జె.అయోధ్యరామ్, బి.అప్పారావు, మరిడయ్య, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై సదస్సులు సరే ఆచరణలు ఎప్పుడు ?

విశాలాంధ్ర - గాజువాక సిటీ : స్వచ్ఛ పట్టణంగా గాజువాకను తీర్చిదిద్దుదాం అంటూ జీవీఎంసీ 65 వ వార్డు, రాజీవ్ మార్గ్, సంజీవిగిరి కోలనీ సచివాలయం వద్ద తడి పొడి చెత్తపై అవగాహన కార్యక్రమం వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు ఈ సందర్భంగా గాజువాక జోనల్ కమిషనర్ సింహాచలం మాట్లాడుతూ పరిశుభ్రత పాటించడం ద్వారా పట్టణ ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు.ఆరోగ్య సమాజ స్థాపణలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు..ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు గాను విస్తృత ప్రచారం చేపడుతున్నట్లు తెలిపారు.గాజువాక పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచినప్పుడే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి వార్డులో ప్లాస్టిక్ ఏరివేయడంతోపాటు- చెత్తను కూడా తడి, పొడి చెత్తగా వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని కోరారు.ఇంటి చుట్టు పక్కల గల మురికి కాలువలో,రోడ్లపై చెత్త వేయరాదన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ వార్డుని పరిశుభ్రంగా ఉంచడం కోసం అన్ని సచివాలయాల పరిధిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో స్మార్ట్ సిటీ అసిస్టెంట్ మేనేజర్ ఏ హేమలత, ఏఎంహెచ్ఓకిరణ్ కుమార్,ఏఈ సుబ్బారావు, వర్క్ ఇన్స్పెక్టర్ గోపాల్, శానిటరీ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్, సీఓ అనంతరావు,అడ్మిన్ గణేశ్, పెంద్ర రాజు,సచివాలయ సిబ్బంది, ఆర్పీలు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. ఒకవక్క స్వచ్ఛత ఆరోగ్య సమాజ స్థాపనలపై జేడ్సి ప్రసంగిస్తున్న వేదికకు కొన్ని అడుగుల దూరంలోనే నివాసాల మధ్య పందులు విచ్చలవిడిగా సంచరించడం వాటిని జేడ్సి దృష్టిలో పడకుండా కాలనీల సందుల్లోకి పందులను తరమడం కోసం ఏకంగా పందుల పెంపకందారులు రంగంలోకి దిగడం , సదస్సులో ఉన్న శానిటరీ సిబ్బంది, ప్రజారోగ్య సిబ్బంది తో పాటుగా సదస్సు దగ్గరకు పందులు రాకుండా తరమడం కోసమే పెంపకందారులను తమవెంట తెచ్చుకున్న చందం గా నిర్భయంగా బహిరంగంగా పందుల పెంపకందారులు వ్యవహరించిన తీరు పలు అనుమానాలకు తావు నిస్తుంది, ఈ స్వచ్ఛత ఆరోగ్య సదస్సులు కేవలం తూతూ మంత్రంగా పబ్లిసిటి కొరకే గానీ ఆచరణ కొరకు కాదులే అంటూ పలువురు కాలనీ వాసులు పెదవి విరచడం కొస మెరుపు.

టీడీపీ గ్రాండ్ క్రిస్మస్ గోడ పత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - మల్కాపురం : తెలుగుదేశం పార్టీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లిగ్రాండ్ క్రిస్మస్‌లి గోడ పత్రికను తెలుగుదేశం పార్టీ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే . గణబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ పార్టీ హయాంలో క్రైస్తవులకు చేపట్టిన అనేక సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. ఈనెల 20 వ తేదీన విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో జరిగే గ్రాండ్ క్రిస్మస్ వేడుకను ను విజయవంవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు, ఈ వేడుకను నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షులు ఉరుకూటి దేవిడ్ చేస్తున్న పార్టీ కార్యక్రమాలను అభినందించి సన్మానించారు, తెలుగుదేశం పార్టీ క్రిస్టియన్ నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమం లో విశాఖ పార్లమెంట్ క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షులు ఉరుకుటి దేవిడ్, పాత్ర వల్లి రాజ్ కుమార్ తదితరులున్నారు.

ఈనెల 16 నుండి ధనుర్మాస ఉత్సవాలు

విశాలాంధ్ర - సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయం లో ఈనెల 16వ తేది నుండి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా స్థానాచార్యులు రాజగోపాల్, ఏ.ఈ.ఓ నరసింహ రాజు, పర్యవేక్షకులు పిల్లా. శ్రీను మాట్లాడుతూ ధనుర్మాసం నుంచి సంక్రాంతి వరకు నిత్య శోభ మది నిండా కొలిచి మనసారా ఆరాధించే ఆ దేవదేవుడి వైభోగం కనులార చూసి తనివి తీరా ఆనందించాలని కోరుకొనే భక్తులకు ఆ పరంధాముడు ఉత్సవ మూర్తిగా చిరునవ్వు నవ్వుతూ నేనున్నానంటూ అభయమిస్తాడు. అంతటి పరమాత్మునికి ఏటా జరిగే వార్షిక, మాసోత్సవాలంటే భక్తకోటికి ఆధ్యాత్మిక సంబరాలే అన్నారు.

ధనుర్మాస వ్రతం : ధనుర్మాసోత్సవాలు ఈనెల 16వ తేది సాయంత్రం 6.20నలకు ప్రారంభం కానున్నాయి. ఆరోజు పాంచరాత్ర అగమ శాస్త్ర ప్రకారం నెలగంట పెడతారు. పూర్వం నెల ఘంటానాదం పెట్టినప్పటి నుంచే గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి పండగ వాతావరణం నెలకుంటుంది. ప్రజలు నెలగంట పెట్టిన తర్వాత సంక్రాంతి పండగ పనులు ప్రారంభించే సంప్రదాయం ఉంది.

జోన్ -2, 3లో మంచి నీటి సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - పీఎం పాలెం : మహా విశాఖపట్నం నగరపాల సంస్థ 2, 3 జోన్‌లలో గురువారం త్రాగునీటికి అంతరాయం కలుగునని జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజనీరు పత్రికా ప్రకటన ద్వారా బుధవారం తెలియజేశారు. జివిఎంసి టీఆర్‌ఎస్ కాంప్లెక్స్ ప్రాంగణంలో గల కొమ్మాది పంపు హౌస్ నకు మరమ్మత్తులు నిమిత్తం జోన్-2 లో గల సాగర్ నగర్, షిప్ యార్డ్ లే-అవుట్, ఆరిలోవ, ఆదర్శ నగర్, రాజీవ్ నగర్, ఇందిరా నగర్, ఎస్‌ఐజి నగర్, రవీంద్ర నగర్, సుందర నగర్, కైలాస్ నగర్, తోటగరువు, పార్వతీ నగర్, గాంధీ నగర్, టిఐసి పాయింట్, డ్రైవర్స్ కాలనీ, బాలాజీ నగర్, పెద్ద గదిలి, చిన్నగదిలి, సింహగిరి కోలనీ, శాలిపేట, జోన్-3లో ఆదర్శనగర్, ఎంవిపి సెక్టార్-8 తదితర ప్రాంతాలలో త్రాగునీటికు అంతరాయం కలుగునని కావున జివిఎంసి కమిషనర్ తరఫున మంచినీటి సరఫరా విభాగం తరపున త్రాగు నీటి అసౌకర్యానికి చింతిస్తూ జివిఎంసికి సహకరించ వలసినదిగా తెలియజేయడమైనది.

రింతాడ పంచాయతీలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

విశాలాంధ్ర - జికెవీధి : పాడేరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో జికెవీధి మండలం రింతాడ పంచాయతీ ఈదులబంద, తీములబంద గ్రామాలలో ముక్కలి రమేష్ అధ్యక్షతన ఇదేం ఖర్మ మన రాష్ట్రనికి అనే కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. మళ్లీ రాష్ట్రం బాగు పడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి గబ్బడ సింహాచలం, పాడేరు నియోజకవర్గ ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు బుక్క జగదీష్, మాజీ జడ్పీటీసీ గంటా నళినికృష్ణ, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కలి మహేష్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కలి కళ్యాణి, మండల అధ్యక్షులు గుంట బుజ్జిబాబు, తెలుగు యువత మండల అధ్యక్షులు ముర్ల కోటేశ్వరరావు, తెలుగు యువత మండల ఉపాధ్యక్షులు చెక్క నాగరాజు, గూడెం కొత్తవీధి మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ పాండురాజు, మాజీ ఎంపీటీసీ సాగిన భవాని, గెమ్మెలి రామారావు, కొర్రా చిన్నారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ లారీ బోల్తా

విశాలాంధ్ర - గాజువాక సిటీ : గాజువాక అగనంపూడి జాతీయ రహదారిపై ఇండియన్ గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా కొట్టడంతో పరుగులు తీసిన జనం, షాపులు మూసి పారిపోయిన నిర్వాహకులు, లంకెలపాలెం నుంచి వస్తూ యూ టర్న్ తీసుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది, గ్యాస్ లీక్ కాకపోవడం చేత సిలిండర్లు పెలకోపోవడం వలన పెను ప్రమాదం తప్పింది రోడ్డుకు అడ్డంగా లారీ పడిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది సమాచారం అందుకున్న పోలీసులు లారీని తొలగించి ట్రాఫిక్ ను క్లియర్ చేసారు, ప్రాణ నష్టం జరగక పోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

సీలేరు ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి కేబినెట్ ఆమోదం

విశాలాంధ్ర - సీలేరు : జికెవీధి మండలం సీలేరులో ఏపిజెన్‌కో ప్రతిపాదిత 1350 మెగావాట్ల పంప్ స్టోరేజ్ ప్రాజెక్టు(ఎత్తిపోతల ప్రాజెక్టు) నిర్మాణానికి కేబినెట్ ఆమోదం లభించడంతో సీలేరులో మరో ప్రాజెక్టు చేరనుంది. సీలేరు కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలయ్యే ఒక టిఎంసి నీటిని వెనక్కి పంపింగ్ చేయడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంతో గత టీడీపీ హయాంలోనే ఈ ప్రాజెక్టుకు ప్రతిపాదన చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల విద్యుత్ అవసరాలను తీర్చడంతో పాటు గ్రిడ్‌ను సమతుల్య పరచడానికి దోహద పడేందుకు సీలేరు వద్ద పంప్ స్టోరేజి ప్రాజెక్టు ఎంతో అనుకూలంగా ఉంటుందని భావించి టీడీపీ హయాంలోనే ఈ ప్రాజెక్టును తెరపైకి తెచ్చారు. అప్పటి ప్రభుత్వం ఏపి జెన్‌కో ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన సర్వే, యుద్ధ ప్రాతిపదికన నిర్వహించి ప్రాజెక్టు డిజైన్, డిపిఆర్‌నపు తయారు చేయాలని అప్పటి ప్రభుత్వం ఆదేశించింది. 2023-24లో ఈ ప్రాజెక్టు పనులను పూర్తి చేసి రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చాలనుకుంది. ఈ మేరకు ఈ ప్రాజెక్టు సర్వే పనులను ఏపి జెన్‌కో వ్యాప్‌కోస్ (వాటర&అండ్ పవర్ కన్సల్టెన్సీకి అప్పగించింది. సీలేరు జలవిద్యుత్ కేంద్రం విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలయ్యే నీటిని రివర్స్ పంపింగ్ ద్వారా 1350 మెగావాట్లు ఉత్పత్తి చేసే ఒక్కొక్కటి 150 మెగా వాట్ల సామర్థ్యం గల తొమ్మిది యూనిట్లు ఏర్పాటు చేయడానికి వ్యాప్‌కోస్ డిజైన్ చేసింది. దీనికి గాను సీలేరు నుంచి విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలయ్యే నీటిని శాండికోరి పరిసర ప్రాంతాల్లో ఒక టిఎంసి నీటిని నిల్వ చేసేలా రబ్బర్ డ్యామ్‌ను నిర్మించడానికి, ఆ నీటిని అండర్ గ్రౌండ్ పైపులైన్ ద్వారా పంపింగ్ చేసి పార్వతీనగర్ వద్దే భూగర్భంలోనే 1350 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడానికి అనంతరం విడుదలయ్యే నీటిని గుంటవాడ జలాశయంలోకి చేరేలా వ్యాప్‌కోస్ సంస్థ డిజైన్ రూపొందించింది.

జనసేన గెలుపు దిశగా పనిచేయాలని

విశాలాంధ్ర హుకుంపేట: గిరిజన ప్రాంతంలో జనసేన పార్టీ గెలుపు దిశగా పనిచేయాలని జనసేన నాయకుడు గంగులయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో అరకు నియోజకవర్గం జన సైనికులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలనను అడ్డుకునేందుకు జనసేన పార్టీ నిరంతరంగా పోరాడుతుందన్నారు. ఈ ప్రభుత్వం నిరంకుశ పాలనను అందిస్తూ ప్రజలకు తీరని కష్టాలు పాలు చేస్తుందని తెలిపారు. ఇటువంటి ప్రభుత్వాన్ని ప్రజలు ఎప్పుడు చూడలేదని ఇదే ఈ ప్రభుత్వానికి చివరి అవకాశం కావచ్చునని జోస్యం చెప్పారు. ఇదే అదునుగా గ్రామ గ్రామాలలో తన పార్టీ చేస్తున్న కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని కోరారు.

ఘనంగా అన్నసమారాధన

విశాలాంధ్ర - పెదగంట్యాడ : 74వ వార్డులోనీ వియ్యపువానిపాలెం గ్రామములో భవాని మాలదారులు ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భములో ఆయన మాట్లాడుతూ అమ్మను నమ్ముకున్న వారు అన్ని విధాలుగా బాగుంటారు అని ఆ అమ్మ ఆశీర్వాదంతో చేసే ఇలాంటి కార్యక్రమాలు ఎందరికో ఆదర్శం అని ఇలాంటి మంచి కార్యక్రమములో నన్ను కూడా భాగస్వామిని చేసిన కమిటీ వారికి ధన్యవాదాలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో నమ్మి అప్పారావు, దోమ్మేటి పెరుమాళ్, వియ్యపు సింహాద్రి, పల్లా శంకరరావు పల్లా రమణ సోము నాయుడు, అప్పల నాయుడు, చిన్నోడు, కమిటీ సభ్యులు, స్థానిక యువకులు, మహిళలు పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్ల నియామకాల్లో సొంత నిర్ణయాలు తగదు

విశాలాంధ్ర - హుకుంపేట : వైఎస్ఆర్ సీపీ సచివాలయ కన్వీనర్ల నియామకాల్లో అరకు ఎమ్మెల్యే తన సొంత నిర్ణయాలు తీసుకోవడం తగదని మాజీ జెడ్పిటిసి కోర్ర కాసులమ్మ, మాజీ మండల అధ్యక్షులు తరవాడ వెంకటరావు, మాజీ ఎంపీటీసీ రామదాస్, రేగం రమేష్ లు ఆరోపించారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అరకు నియోజకవర్గ పరిధిలో గల ఆరు మండలాల్లో సచివాలయ కన్వీనర్ల నియామకాల్లో ఏ ఒక్క కార్యకర్తలు కూడా చర్చించకుండా తన పార్టీ అనుచరులకు తన అనుచరులకు నియమించుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. పార్టీ ఆవిర్భావం నుండి అహర్నిశలు రాత్రి పగల్లో కష్టపడిన సీనియర్ నాయకుల సైతం పక్కన పెట్టి తన సొంత నిర్ణయాలతో తన అనుచరులను నియమించుకోవడం తగదని వారు ఆరోపించారు. ఇటువంటి ధోరణి అవలంబించడం వలన పార్టీకి తీరని నష్టం కలుగుతుందని వారన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే గారు ఒంటెత్తు పోకడాలు మాని అందర్నీ కలుపుకొని రాబోయే ఎన్నికల్లో విజయం సాధించే దిశగా అడుగులు వేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో. మాజీ సర్పంచులు అప్పలరాజు, మజ్జి చంద్రబాబు, సందడి కొండబాబు, సుభాష్, భీమరాజు, పరుశురాం, వెంకటకృష్ణంనాయుడు, పాంగి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో టీడీపీ సర్పంచ్‌లు ధ్వజం

విశాలాంధ్ర - మాకవరపాలెం : అన్‌రాక్ నిర్వాసితులకు రెండు సెంట్ల స్థలాన్ని ఎందుకు ఇవ్వలేదంటూ మండల సర్వసభ్య సమావేశంలో టీడీపీ సర్పంచ్‌లు ధ్వజమెత్తారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ప్రసాదరావు మాట్లాడుతూ మండలంలో ఏడు గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశామన్నారు. దీని వల్ల రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. మరో ఏడు గ్రామాల్లో ప్రారంభించడం జరిగిందన్నారు. ఇదిలా ఉండగా సభలో టీడీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తక్షణమే అన్‌రాక్ నిర్వాసితులకు తక్షణమే రెండు సెంట్ల స్థలాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఇటీవల సంభవించిన తుపాన్ కారణంగా మండలంలో రైతులు పంటను నష్టపోయారని, తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, జెడ్పీటీసీ కృష్ణవేణి, ఎంపిడిఓ అరుణశ్రీ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు మంజూరు

విశాలాంధ్ర - ఆనందపురం : ప్రవాస్ యోజన లో భాగంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ సోము వీర్రాజు ఆదేశాల మేరకు ఆనందపురం మండల ఇన్చార్జి ఉప్పాడ అప్పారావు, బిజేపి కిసాన్ మోర్చా ఉత్తరాంధ్ర జోన్ సోషల్ మీడియా కన్వీనర్ పి.వి.వి. ప్రసాదరావు పట్నాయక్ హాజరై ప్రసంగించారు. బిజేపి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ప్రధానమంత్రి ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయడం జరిగింది అని, ముద్ర రుణాలు బిజేపి కార్యకర్తలకు, ఎస్సీ రుణాలు,అందరికీ మంజూరు చేయించడం జరిగిందని, 6000 ఈ- శ్రమ్ కార్డు లు చేయించడం జరిగిందని, బిజేపి కార్యకర్తలకు అన్ని విధాల సహాయ సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆనందపురం మండల బిజేపి మండల పార్టీ అధ్యక్షులు మీసాల రాము నాయుడు, మండల మహిళ మోర్చా అధ్యక్షురాలు అలమండ. లక్ష్మి, ప్రధాన కార్యదర్శి, గంద్రెడ్డి వెంకటరావు, పిల్లా చిన్నా రావు, బోర శ్రీను,యువ మోర్చ, మహిళా మోర్చా, ఎస్సీ మోర్చా, ఓబీసీ మోర్చా అధ్యక్షులతో మండలంలో వెల్లంకి, వేముల వలస, పెద్ది పాలెం, సొంట్యం, నగర పాలెం, బంటు పల్లి కళ్ళాలు పర్యటించారు.

రోడ్డు ప్రమాదంలో జీసిసి ఉద్యోగి మృతి

విశాలాంధ్ర - చింతపల్లి : చింతపల్లి మండల కేంద్రంలోని ప్రధాన రహదారి నడిబొడ్డులో మంగళవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో గిరిజన సహకార సంస్థ సేల్స్ మెన్ (డీలర్) సలభం నాగం నాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. భార్య, కుటుంబ సభ్యులు క్షతగాత్రున్ని హుటాహుటిన స్థానిక ఏరియా ఆసుపత్రికి, అక్కడినుండి మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖపట్నం కేర్ ఆస్పత్రికి తరలించారు. కేర్ ఆస్పత్రి లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమంగా మారి అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు నాగం నాయుడు పార్థివ దేహాన్ని చింతపల్లి కి తీసుకు రావడంతో స్థానిక ఏరియా ఆసుపత్రి వైద్యులు మృతదేహానికి బుధవారం పంచనామ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. స్వగ్రామం బెన్నవరంలో అంత్రక్రియలు నిర్వహించారు. మరణ వార్త విన్న తోటి ఉద్యోగస్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. తోటి ఉద్యోగస్తులు ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విధి నిర్వహణలో అందరికీ ఆదర్శంగా ఉండే నాగం నాయుడు కుటుంబానికి అండగా ఉంటామని జీసిసి ఉద్యోగ సంఘ నాయకులు తెలిపారు.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు తొలగింపు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : సీతమ్మధార రైతు బజార్ సమీపంలో ఉన్న యూనియన్ బ్యాంక్ ఆవరణంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది అక్రమనకు పూనుకోవడంతో జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది బుధవారం అక్కడ ఉన్న తాత్కాలిక రేకుల షెడ్డు ను తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆక్రమణదారులకు, జీవీఎంసీ అధికారులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురిచేస్తే ఊరుకునేది లేదని ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ అధికారులు హెచ్చరించారు.

చింతపల్లి ఎంపీడీవోగా లాలం సీతయ్య

విశాలాంధ్ర - చింతపల్లి : చింతపల్లి ఎంపీడీవోగా లాలం సీతయ్య బుధవారం అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. గత నెల వరకు ఇక్కడే ఎంపీడీవోగా విధులు నిర్వర్తించిన ఆయన వ్యక్తిగత కారణాల చేత దీర్ఘకాలిక సెలవు పై వెళ్లడంతో జిమాడుగులకు చెందిన ఈవోపీఆర్డి రమేష్‌ను తాత్కాలిక ఎంపీడీవోగా నియమించారు. ఇప్పటివరకు ఆయన విధులు నిర్వర్తించారు. సెలవుపై వెళ్లిన సీతయ్యను తిరిగి చింతపల్లి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించాలని అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించడంతో బుధవారం ఆయన చింతపల్లి ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించారు.

ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఫిర్యాదుల దినం

జీవీఎంసీ కమిషనర్ పి. రాజబాబు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : జీవీఎంసీ పరిధిలో పట్టణ ప్రణాళిక విభాగంలో ఎలాంటి సమస్యలు ప్రజలకు తలెత్తిన ఇకపై ప్రతి శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరగనున్న ఫిర్యాదుల స్వీకరణ కార్య క్రమాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజబాబు తెలియజేశారు. ఓల్డ్ కౌన్సిల్ హాల్‌లో టౌన్ ప్లానింగ్ ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఎల్ఆర్ఎస్, టీడీఆర్, ప్లాన్ మంజూరులో ఇబ్బందులు, నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన భవనాలపై, రోడ్ల విస్తరణ సమస్య, సర్వే సమస్యలపై నగర ప్రజల స్వచ్ఛందంగా ఈ గ్రీవెన్స్ లో తమ ఫిర్యాదులు తెలియ జేయవచ్చునని తెలియజేశారు. ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఫోరమ్ డే కూడా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని నిబంధనలు ఉండడంతో ఇకపై ప్రతి శుక్రవారం క్రమం తప్పకుండా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కమిషనర్ ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సురేష్ కుమార్, డీసీపీలు పద్మ, సంజీవ్ కుమార్, నరేందర్ రెడ్డి, ఏసీపీలు అరుణవల్లి, శాస్త్రి, వినయ్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏకగ్రీవం

విశాలాంధ్ర - యలమంచిలి : ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్జీవో నాయకులు ఉల్లి కృష్ణ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడుగా వై.నారాయణరావు,ఉపాధ్యక్షులుగా యలమంచిలికి చెందిన తంగేటి నాగేశ్వరరావు ఎన్నికవడం పట్ల బుధవారం నాడు ఏపీఎన్జీవో అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేసినట్లు ఒక ప్రకటనలో తెలియజేశారు.